నేనూ నవ్వేశాను. "ఔను. నాకు తట్టనే లేదు సుమా! నేను అంత డీప్‌గా ఆలోచించ లేను. పైపైనే వూహించగలను. చెప్పానుగా. అగాధాలన్నా, అగాధంవంటి ఆలోచనలన్నా నాకు భయం!" అన్నాను.

రెండు రోజులు పోయాక వెళ్ళాలంటూ వసంత బయలుదేరింది. సరూకి యింకా నీరసం తగ్గలా. "సర్దాగా వచ్చారు కానీ, నావల్ల మీకు యిక్కడ చాకిరీ తప్పలేదు" అంది సరూ, వసంతతో.

"అలా అనుకునేదాన్నయితే, ఇక్కడికి వచ్చివుండేదాన్నే కాదు" అంది వసంత.

నీరసంగా వున్నా సరూ వసంతకి అన్ని మర్యాదలూ చేసి సాగనంపింది.

* * *

ఇది మూడేళ్ళ క్రిందటి మాట.

రెండు నెలల క్రిందట సరూ వాళ్ళ నాన్న గారికి బాగులేదని చూడ్డానికి వాళ్ళ వూరెళ్ళింది. ఆమె తిరిగి రావడానికి ఇంకా కొన్నాళ్ళు పడుతుంది. ఆఫీసు ప్యూన్‌తో కారియర్ తెప్పించుకుంటూ, రాబిన్సులాంటి వేడి పుస్తకాలు నంజుకుంటూ రోజులు వెళ్ళమారుస్తున్నాను.

వసంతా వాళ్ళకి యీలోగా యిక్కడికే ట్రాన్స్‌ఫర్ అయింది. ఫర్లాంగు దూరంలో. రెండువీధుల అవతల ఇల్లు తీసుకున్నారు. సరూ లేదని వసంత చాలా నొచ్చుకుంది. సరూ లేకపోయినా, వాళ్ళందరికీ స్వాగతం చెప్పినట్టుగా వుంటుందని హోటల్ సవేరాలో వాళ్ళకి డిన్నరిచ్చాను. సరూ వచ్చాక మరో మంచి డిన్నర్ ఏర్పాటు చేస్తానని కూడా ప్రామిస్ చేశాను.

"అబ్బ! ఇంత పెద్ద హోటల్ని గురించి పుస్తకాల్లో చదివానేమోగానీ, కలలోనైనా చూళ్ళేదు సుమా! అంది వసంత.

"నిజానికిలాంటి హోటల్ బెంగుళూరులో వుండవలసింది!" అన్నాడు మూర్తి, వసంత భర్త.

నేను ఆర్డరు చేసిన విచిత్రమైన డిషెస్ అన్నీ తన ఇద్దరు పిల్లలలాగానే ఉత్సాహంగా ఆనందంగా తిన్నది.

"అమ్మయ్య! బిల్లు భలేబరువుగా వుంటుందనుకుంటా నీకు! పొట్టలే యింత బరువైపోతేనూ!" అంది.

వారం రోజుల తర్వాత, ఈ రాత్రి ఇక్కడ వసంత!

అవకాశం అంటోంది, ఉపయోగించుకోవడం అంటోంది. ఏమిటో ఆవిడ ధోరణి. నాకంతు బట్టలా.

"చూడు! గడ్డిపోచమీద నిల్చిన మంచు బిందువులో కలల ఇంద్రధనుస్సులు విరుస్తాయి. తాకితే ఆ ప్రపంచమే విధ్వంసమైపోతుంది. నేను సౌందర్యాన్ని ఆరాధిస్తానని నీకు తెలుసు కదా!" అన్నాను.

వసంత మాట్లాడలేదు. "అవకాశాలకేం? కల్పించుకుంటే బోలెడు దొరుకుతాయి. ముఖ్యమైన అవకాశాన్ని ఎప్పుడో పోగొట్టుకున్నను తెలిసో, తెలియకో! అందుకు యిప్పుడు బాధ ఎందుకు?" అన్నాను.

కాసేపు నిశ్శబ్దం అవహించింది. "సూర్యం! నాకు అర్థమైంది! నువ్వు ప్రిగ్గిష్ ఫూల్‌వి! సరూ యెలా చేస్తోందో నీవంటి వాడితో సంసారం ... వస్తాను! కుర్రాళ్ళు నిద్ర లేస్తారేమో! ఆయన కేంపు కెళ్ళారు!"

చివాల్న తలుపు తెరుచుకుని వెళ్ళిపోయింది. నేను ఒంటరిగా మిగిలిపోయాను, రాజ్యాన్ని పోగొట్టుకున్న చక్రవర్తిలా.

వసంత! అందం, చైల్డిష్‌నెస్, స్త్రీత్వం, అసూయ, లాలిత్యం, డేరింగ్, కవిత్వం, జనరాసిటీ, తెలివి, చురుకుదనమూ—ఓహ్! ఎన్నో చెప్పలేను. అన్నీ తలబోసిన మిశ్రమం. ఆమె నాకు అర్థం అవుతుందా?

గ్రాండ్ కాన్యన్ ఫోటో చూస్తున్నాను. అట్రాక్టివ్‌గా వుంది. భయంకరంగానూ వుంది. ఇదొక లవ్-హేట్ రిలేషన్‌షిప్! అంతేనేమో!



# మరుభూమి

కళింకోట ప్రభాకరదేవ్

పవిత్రులు అపవిత్రులు, ధనవంతులు, దరిద్రులు, పెద్దలు, పిన్నలు అనే తారతమ్యం లేకుండా చివరకక్కడ అందరూ మట్టిలో కలిసిపోవల్సిందే. మనిషి జీవనయాత్ర కది చివరి మజిలీ. విభిన్న జీవితాలపాలిట సమవర్తి! సమదర్శి!!

శవం కాలుతున్న వాసన—

ఎండిన జమ్మిచెట్టుమీద తీతువుపిట్ట కూర్చుని మనిషి అంతిమస్థానానికి నేపథ్య గీతం ఆలపిస్తున్నట్టుగా అరుస్తుంది.

చితి రగుల్కొంటుంది....

'జీవి' ఊర్ధ్వలోకానికి పయనిస్తున్న[illegible]మో నన్న భ్రమను స్ఫురింపచేస్తూ....చితిమంటలు మింటికెగస్తున్నాయి.

చితిలోకి మండుతున్న కట్టెల్ని యాంత్రికంగా నిర్లిప్తంగా ఎంకడు ఎగదోస్తున్నాడు.

ఎంకడు కాటికాపరి.

నలభై సంవత్సరాల వయస్సుంటుంది. నల్లగా, సన్నగా....మాడిపోతున్న శవంలాగ వుంటాడు. వాడ్ని చూడగానే "పాపం వీడు తిండితిని ఎన్ని వారాలయివుంటుందో!" అనే జాలి కలుగుతుంది.

మొలకు, గాంధీ కట్టుకునే గావంచాలాంటిది మినహా వాడి వొంటిమీద మరే ఆచ్ఛాదనా వుండదు.

స్మశానాన్ని నమ్ముకుని బ్రతుకుతున్నాడు. ఇంతవరకూ వాడు తగులబెట్టిన శవాలు వేల సంఖ్యలో వుంటాయి. భయాన్ని, దుఃఖాన్ని కలిగించే శవాలు ఎంకడికి ఆనందాన్ని కలిగిస్తాయి. శవం స్మశానానికి వచ్చిందంటే, వారాల తరబడి పస్తున్న కుక్కకు ఎండురొట్టె దొరికినంతగా సంబరపడిపోతాడు ఎంకడు.

స్మశానమే వాడి లోకం—

ఆ లోకంలో అడపాదడపా ఆకలి కొంత చల్లారుతుంది. అదే పదివేలనుకుంటూ ఇన్నాళ్ళూ బ్రతికేశాడు. అయితే, ఈ మధ్య గత కొన్ని దినాలుగా వాడి మనసులో దిగులు మొదలయింది.

ఏదో వెలితి వాడి మనసును చికాకు బరుస్తూ వుంది. ఎంకడు తన గురించి ఎన్నడూ బాధ పడలేదు. ఆలోచించలేదు. ఇప్పుడూ అంతే. వాడి దిగులుకుగల కారణం 'ఈరిగాడు'.

ఈరిగాడు ఎంకడికి వొకేవొక బంధం. 'ఈరిగాడు' అంటే ఎంకడికి అందుకనే ప్రాణం. ఈ లోకంలో తనవారంటూ వున్నది 'ఈరిగాడు' మాత్రమేనన్న ఆపేక్షకొద్దీ వాడ్ని కంటికి రెప్పలాగ చూసుకుంటూ వచ్చాడు.

'ఈరిగాడు' తల్లి పచ్చిబాలింతలోనే కన్ను మూసేసింది. ఆ శవాన్ని దహనం చేసింది కూడా ఎంకడే.

అయిదవ ఏట పిల్లలకు అక్షరాభ్యాసం చేయించినట్లుగా 'ఈరి'గాడికి అయిదవ సంవత్సరం రాగానే చితిలోకి కట్టెల్ని ఎగదొయ్యడం....శవాన్ని కాల్చడం మొదలైన వాటికి శ్రీకారం చుట్టించాడు ఎంకడు. అయితే, వయస్సొస్తున్నకొద్దీ ఈరిగాడికి తను చేస్తున్న పని నచ్చలేదు.

స్మశానికి కొద్ది దూరంలోగల బంజరు భూముల్లో పశువుల్ని మేపటానికి వచ్చే పిల్లల్ని చూసి, వాళ్ళలాగే తను కూడా ఎవరి పశువులన్నా కాపలాకాస్తే బాగుండుననుకున్నాడు.

స్మశానంలో చితుల్లోకి కట్టెల్ని ఎగదోసే పని కన్నా పశువుల్ని మేపడంలో ఏదో కొత్తదనం, ఆనందం వున్నట్టనిపించింది వాడికి. చివరకు, రెండువారాల క్రిందట తండ్రితో చెప్పి 'పెద్ద నాయుడు' దగ్గర పశువుల కాపరిగా చేరి పోయాడు ఈరిగాడు.

కొడుకు తన దగ్గర్నుండి వెళ్ళిపోయిన దగ్గర్నుండి, సర్వస్వాన్ని కోల్పోయిన వ్యక్తి లాగ ఎంకడు తయారయ్యాడు. 'కొడుకు' లేని వెత్తి గుండెను పిండసాగింది.

"ఎర్రి ఎదవ! పెద్దనాయుడి దగ్గర్న ఎట్టాగ వున్నాడో....ఏటో!!"

పదేపదే కొడుకుని తలుచుకుంటూ కంట తడి పెట్టుకోసాగేడు ఎంకడు.

* * *

'పెదనాయుడు' పేరుకు తగినట్టుగా ఆ వూరికి పెద్ద. పంచాయితి ప్రెసిడెంటు.

పెద్దనాయుడిది భారీ విగ్రహం. మదించిన ఎద్దులాగ వుంటాడు.

అతడికి వూర్లో లంకంత యిల్లువుంది. ఆ లంకలో శూర్పణలాంటి పెళ్ళాం వుంది. ఊర్లోని లంకంత కొంపే కాకుండా పట్నంలో వొక పెదడాబా కూడా పెద్దనాయుడికి వుంది. దాంట్లో పెద్దనాయుడు పెర్మనెంటుగా వుంచు కున్న ముండ వుంది. దాన్నగ్గరే పెద్దనాయుడు పంచాయితీ ప్రెసిడెంటు పదవిని అడ్డం పెట్టు కుని సంపాదించినదంతా దాచిపెట్టాడని వూర్లో వాళ్ళు చెవులు కొరుక్కుంటుంటారు. ఆ మాట గట్టిగా పైకి అనే ధైర్యం ఆ వూర్లో వాళ్ళకు లేదు.

పశువుల్ని మేపడానికి ఈరిగాడు సరదా పడ్డాడేగాని, పెద్దనాయుడి దగ్గర పన్లోకి చేరిన తరువాత తెగభయపడిపోయాడు. అలవాటు లేని పనులతో అంతా అయోమయంగా వుండేది. దానికి తోడు అక్కడ అందరూ కొత్త. గుంపునుండి తప్పిపోయిన మేకపిల్ల లాగ తయారయింది వాడి పరిస్థితి. అయితే రాన్రానూ అక్కడి వాతావరణానికి అలవాటు పడసాగేడు.

ఈరిగాడు పేరుకి 'పశువుల కాపరి' గాని, పెద్దనాయుడు యింట్లో చాలా పనులు చేయాలి.

తెల్లవారక ముందే లేవాలి.

గొడ్లశాలను శుభ్రంచేసి, పశువులకు మేత పెట్టాలి.

నూతిలో నీళ్ళుతోడి, యింట్లో వాళ్ళకి స్నానంకి వేడినీరు సిద్ధంచెయ్యాలి.

ఆ తరువాత, బజారుపన్లు....

ఇవన్నీ జరిగాక, చద్దన్నం తిని గొడ్లను తోలుకుపోవాలి.

సంక్షిప్తంగా యిదీ ఈరిగాడి దినచర్య.

ఒళ్ళు దాచుకోకుండా పని చెయ్యడం వలన కొద్ది రోజుల్లోనే పెద్దనాయుడి అభి మానాన్ని కొంత ఈరిగాడు సంపాయించుకో గలిగాడు.

గొడ్డుల్లాగ పని చేసేవాళ్ళన్నా, కుక్కల్లాగ పడివుండే వాళ్ళన్నా పెద్దనాయుడికి యిష్టం.

వంట నూర్పిళ్ళ సమయమది—

మధ్యాహ్నం ఎద్దుల జతకు కుడుగుపెట్టి, కుప్పనూర్పిళ్ళకు పొలానికి తోలుకు వెళ్ళ బోతుంటే, మీనాక్షి ఈరిగాడ్ని పిలిచింది.

మీనాక్షి పెద్దనాయుడు ఏకైక కూతురు.

"పంతులు మాష్టారుగారి యిల్లు నీకు తెల్సా?" అని ప్రశ్నించింది.

ఈరిగాడు తెలుసునన్నట్లుగా తలాడిం చాడు.

మీనాక్షి అటూ ఇటూ చూసి, జాకెట్టులో నుండి మడతలు పెట్టిన గులాబిరంగు ఉత్త రాన్ని పైకి తీసింది.

"దీన్ని తీసుకువెళ్ళి పంతులు మాష్టారికి జాగ్రత్తగా యివ్వు. మరెవరికీ....ఈ సంగతి తెలియకూడదు" అన్జెప్పి, ఆ వుత్తరాన్ని, దాంతోపాటు పావలాను ఈరిగాడికి యిచ్చింది.

మీనాక్షికి ఇరవై సంవత్సరాల వయస్సుం టుంది. ఆ వయస్సు తెచ్చిన పొంగులతో పిటపిటలాడుతూ వుంటుంది.

ఇంకా, పెళ్ళికాలేదు.

కొత్తగా ఆ వూరికి వచ్చిన కుర్రపంతులు మాష్టార్ని ప్రేమించింది. అతడ్నే పెళ్ళాడాలని



నిశ్చయించుకుంది. ఆ నిశ్చయంతోనే తండ్రి తెచ్చిన పెళ్ళిసంబంధాన్ని కాదని, తన మనసు లోని మాటను ధయిర్యంగా చెప్పేసింది.

పెద్దనాయుడు దేన్నయినా భరించగాలడు గాని పేదోళ్ళను ప్రేమించడాన్ని మాత్రం ససేమిరా భరించలేడు.

కూతురి మనసు మార్చడానికి ప్రయత్నిం చాడు. లాభం లేకపోయింది. దాంతో కూతురు యిల్లు కదలనీయకుండా కట్టుదిట్టం గావించాడు.

ఈ తతంగమంతా కొత్తగా పన్లోకి చేరిన ఈరిగాడికి తెలియదు. మీనాక్షి యిచ్చిన వుత్త రాన్ని భద్రంగా ఖద్దరు బనీను జేబులో దాచు కొని - పావలాకాసును చేత్తోపట్టుకుని - హుషా రుగా బయలుదేరాడు.

ఈరిగాడు వెళ్ళేసరికి పంతులు మాష్టారు యింట్లో లేరు.

"సాయంత్రం తిరిగి యింటికివెళ్ళేటప్పుడు పంతులుగారికి యివ్వొచ్చులే" అనుకుని పొలంకి వెళ్ళిపోయాడు.

ధాన్యం ఎగురబోస్తున్న సమయంలో— పర్యవేక్షణ కొచ్చిన పెద్దనాయుడి దృష్టిలో ఈరిగాడి జేబునుండి సగం బైటకు తొంగి

చూస్తున్న గులాబిరంగు వుత్తరం పడింది.

పెద్దనాయుడి భృకుటి ముడివడింది.

కుతూహలం చెలరేగింది.

ఈరిగాడ్ని దగ్గరకు పిలిచి, వాడి జేబులో నున్న కవరును లాక్కున్నాడు పెద్దనాయుడు.

ఈ పరిణామానికి ఈరిగాడు బిక్కచచ్చి పోయాడు. గులాబిరంగు వుత్తరాన్ని చదువు కున్న పెద్దనాయుడి ముఖం మాడిపోయింది.

అతికష్టంమీద కోపాన్ని అణచుకుని గంభీరంగా తలపంకించాడు.

గులాబిరరగు వుత్తరాన్ని మడతబెట్టి ఈరిగాడికి యిచ్చేస్తూ—

"ఈ వుత్తరం చిన్నమ్మగారు మాష్టారుకి యివ్వమన్నారు కదూ....?" సాధ్యమైనంత సరళంగా అడిగారు.

అవునన్నట్లు తలాడించాడు ఈరిగాడు.

"సర్లే. వుత్తరాన్ని తీసుకువెళ్ళి, మాష్టారుకి యిచ్చేయి. అయితే, నే నీ వుత్తరాన్ని చదివినట్లుగా ఎవ్వరి దగ్గరా చెప్పకు. చెప్పావా మక్కలిరగ కొడ్తాను" కళ్ళెర్రజేసి, హెచ్చరించాడు పెద్దనాయుడు.

బాగా చీకటిపడేక పశువుల్ని తోలుకుంటూ యింటికి బయలుదేరాడు ఈరిగాడు.

దార్లోనే పంతులు మాష్టారు యిల్లు.

భయం భయంగా ఆ వుత్తరాన్ని మాష్టారుకి అందచేశాడు ఈరిగాడు.

* * *

అర్ధరాత్రివేళ—

ఏదో పీడకలకు భయంతో వులిక్కిపడి కళ్ళు తెరిచాడు ఈరిగాడు.

అంతా చీకటి.

కీచురాళ్ళు చీకటి సన్నివేశానికి లయవేస్తున్నాయి....రొదగా.

పక్కగదిలోనుంచి చిన్నగా మాటలు....

చెవులు రిక్కించాడు ఈరిగాడు అప్రయత్నంగా.

"మన మీనాక్షి మాష్టారుతో లేచిపోవడానికి సిద్ధపడింది రాజ్యం! .... మాష్టారుకి వుత్తరం వ్రాసింది" పెద్దనాయుడి కంఠస్వరమది.

"అంతకు తెగించిందా?" ఆశ్చర్యపోయింది పెద్దనాయుడి భార్య రాజ్యం.

"ఊఁ .... మరింక మనం చేతులుకట్టుకు కూర్చుంటే లాభం లేదు రాజ్యం!....అందుకనే ఆ మాష్టారు పీడను వొదిలించుకుంటున్నాను. శాశ్వతంగా."

"అంటే?"

"మన మనుషుల్ని పంపి ఈ రాత్రికి మాష్టార్ని మక్కలిరగతన్నమన్నాను."

"తన్నినంత మాత్రాన....మనసు మారిపోతుందా?" భార్య అనుమానం.

"ఊహూఁ....మారదు....ఆ సంగతి నాకు తెలుసు. అందుకనే, వాడ్ని చితుగా తన్ని యింట్లోపడేసి...కొంపకు నిప్పుపెట్టమన్నాను."

మాటలు ఆగిపోయాయి.

ఈరిగాడికి వొళ్ళంతా చెమటపట్టేసింది. శరీరం వణకసాగింది.

"పంతులు మాష్టార్ని కాల్చి చంపేస్తారా? బ్రతికున్న మనిషినే....! బాబోయ్....!!"

మరింక అక్కడ వుండలేకపోయాడు.

ఎంకడి పాక శ్మశానాన్ని అనుకునే వుంది.

అర్ధరాత్రివేళ - చెమటలు కక్కుతుంటూ పరిగెత్తుకు వచ్చిన కొడుకుని చూసి ఎంకడు ఆశ్చర్యపోయాడు.


"మరింక....నిన్నిడ్చి నా నెక్కడికీ ఎల్లన్రా అయ్యా! నీతోనే వుండిపోతా...." భయం భయంగా అన్నాడు. వాడి కళ్ళముందు మంటలు....ఆ మంటల్లో మాష్టారు యింకా కదుల్తూనే వున్నారు.

"ఏం జరిగిందిరా?" ఎంకడు కొడుకుని దగ్గరకు తీసుకుంటూ అనునయంగా అడిగాడు.

"ఇక్కడ మనం సచ్చినోళ్ళనే కాలుత్తాం అయ్యా! అక్కడ .... బ్రతికున్నోళ్ళనే కాల్చేత్తున్నారు...." అన్నాడు.

కొడుకు మాటలు ఎంకడికి సరిగ్గా అర్థం కాలేదు. కొడుకుని ఆప్యాయంగా అక్కున చేరుద్చుకుంటూ "ఈడు తన దగ్గరకు తిరిగొచ్చేసినాడు. అదే పదివేలు" అనుకున్నాడు మనసులో. □





## సుబ్బారాయుడు-సుబ్బలక్ష్మి

చిత్ర నిర్మాణంలో చిరకాలానుభవం వున్న దర్శకుడు కె. హేమాంబరధరరావు తాజా చిత్రం యిది. షూటింగు, ఆరు పాటల చిత్రీకరణతోసహా పూర్తయింది. ఆరు పాటల్ని మాలగా కూర్చి యిటీవల పత్రికల వారి కోసం సౌతిండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వారి ప్రీవ్యూ థియేటర్‌లో ప్రత్యేకంగా గీతమాలా కార్యక్రమం యేర్పాటు చేశారు హేమాంబరధరరావుగారు. పాటలు బావున్నాయి. నూతన్ ప్రసాద్, కవిత, నరసింహరాజు, జ్యోతి (తూర్పువెళ్ళే రైలు) నాగభూషణం, పద్మనాభం, హరిబాబు, రావికొండలరావు దాశరధి కాక మరికొందరున్నారు తారాగణంలో.

## ఒక్క రూపాయి

ఈ పేరుతో సమ్రాట్ ప్రతాపరుద్ర ప్రొడ

'పరోపకారి పాపన్న'లో కాకరాల, కె. విజయ

